సమ్మర్ క్యాంప్‌లో.. రేపు క్విజ్ పోటీలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 19 : జీహెచ్ఎంసీ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా 21న విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామని కూకట్‌పల్లి జడ్సీ అభిలాష తెలిపారు. జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలోని 44 కేంద్రాల్లో నిర్వహించే క్యాంపుల్లో 4వేల మంది విద్యార్థులు క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకుంటున్నారని తెలిపారు. దీనిలో భాగంగా క్విజ్ పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మంగళవారం (ఈ నెల 21న) కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని జీహెచ్ఎంసీ క్రీడా ప్రాంగణంలో ఉదయం 7 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. సమ్మర్ కోచింగ్‌లో పాల్గొన్న వారు(6 నుంచి 16 ఏండ్లు) అర్హులని తెలిపారు. కోచ్ అంజిబాబు (9652777713), సహాయక కోచ్ వెంకట్‌రావు (9908770800) సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని జడ్సీ తెలిపారు.

26 నుంచి శృంగేరి శారదా శంకమఠం వార్షికోత్సవాలు

అల్లాపూర్, మే19 : మోతీనగర్ పరిధిలోని శ్రీ శృంగేరి జగద్గురు మహా సంస్థానం శ్రీ శృంగేరి శారదా శంకర మఠం 25వ వార్షికోత్సవాలు 26 ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి సీఎస్ఆర్ మూర్తి ఆదివారం తెలిపారు. మొదటిరోజు ఆదివారం ఉదయం 7 గంటలకు గురువందనం, గురుపాదుకా పూజ, శ్రీ ఆది శంకరాచార్యుల అష్టోత్తర శతనామార్చన,గణపతి పూజ కలశస్థాపన, 10 గంటలకు శ్రీలక్ష్మి గణపతి హోమంతో పూజలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ శ్రేణులకు అభినందనలు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీని కలిసిన ప్రేంనగర్ కాలనీ బీఆర్ఎస్ నాయకులు

శేరిలింగంపల్లి, మే 19 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని తరపున ప్రచారంలో అహర్నిశలు శ్రమించిన బీఆర్ఎస్ శ్రేణులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అభినందించారు. కొండాపూర్ డివిజన్ ప్రేంనగర్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే గాంధీ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో శక్తివంచన లేకుండా కొండాపూర్ బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేశారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు పార్టీని వీడినప్పటికి కిందిస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నిర్వహించిన ప్రచారంలో చురుకైన పాత్ర పోషించడం హర్షించదగిన విషయం అన్నారు. సత్యంగౌడ్, శ్రీనివాస్ నాయుడు, మంగళికృష్ణ, ప్రభాకర్ ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

కల్యాణం.. కమనీయం

కేపీహెచ్‌బీ కాలనీ, మే 19 : కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని శ్రీఉమారామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం ఆలయ ప్రాంగణంలోని విజయ దుర్గాదేవి ఆలయం, ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్, ఆలయ కమిటీ చైర్మన్ మందడి శ్రీనివాస్‌రావు పూజలు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివ పార్వతుల కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని పూజలు చేశామని తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగాయి. ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, గణపతి పూజ, పుణ్యాహవరచనం, పంచగవ్యం జరిగాయి. ఆలయ నిర్మాణదాత, కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులు పూజలు చేశారు. నేడు (సోమవారం) శ్రీ ఉమాదేవి అమ్మవారికి అభిషేకం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఊరేగింపు, పవళింపు సేవ, నీరాజన మంత్రపుష్పం, వేద ఆశీర్వచనం, ధ్వజావరోహనం పూజలు ఉంటాయని తెలిపారు.

శాంతి కల్యాణ వేడుకల్లో కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు దంపతులు

శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

బాలమురుగన్ విగ్రహ ప్రతిష్ఠాపన

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ పరిధిలో బాలమురుగన్ కుమారస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం జరిగింది. తమిళ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట స్వామి అధ్యక్షతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో మొదటి రోజు స్వామివారి ఊరేగింపు, రెండోరోజు హోమాలు చేసి మూడోరోజు విగ్రహ ప్రతిష్ఠాపన చేసి.. డాక్టర్ ఎమ్.మురళీధరన్ వివాదియార్, డాక్టర్ ఎన్.రాజు సమక్షంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో నాయకులు, తమిళ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.కోట స్వామి, ఉపాధ్యక్షులు ఆర్.గణేశన్, జనరల్ సెక్రటరీ కె.చిన్న స్వామి, ట్రెజరర్ టి.భాస్కర్, జాయింట్ సెక్రటరీ ఎస్.ఆనందం, తమిళ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

- జీడిమెట్ల

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చెన్నై నుంచి విచ్చేసిన విశ్వశిఖర నాట్యాలయ భరతనాట్య గురువులు మీనా, కృష్ణప్రియ తమ శిష్య బృందంతో కలిసి నర్తించారు.

- కొండాపూర్

కూకట్‌పల్లి రైతుబజార్‌లో.. కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 19 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ –రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 21, వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 45, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి 16, ఫ్రెంచ్ బీన్స్ 95, క్యారెట్ 40, కాలీ ఫ్లవర్ 23, దొండ 28, చిక్కుడు 70, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 19, క్యాప్సికం 45, ఆలుగడ్డ 28, కీరా 18, దోసకాయ 23, సొరకాయ 9, పొట్లకాయ (1) 18, కందగడ్డ 70, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 24, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 28, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు(12) 65 నుంచి 75, మునగకాయ(1) 4 నుంచి 5, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80 గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9 : 30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

నేరాల నియంత్రణకు.. సీసీ కెమెరాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 19 : నేరాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నాగిరెడ్డి కాలనీలో సీసీ కెమెరాల వ్యవస్థను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత నేరాలు తగ్గుముఖం పట్టాయని, నేరస్తులను గుర్తించేందుకు ఉపయోగపడతాయన్నారు. కాలనీ, బస్తీ, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నాయకులు బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు హరీశ్, మధు పిల్లై, సావిత్రి, రామకృష్ణ, మధుసూదన్, చంద్రకళ, లతా, రమాదేవి, నర్సింగ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల వ్యవస్థను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్

పుట్టగొడుగుల్లా.. అనుమతిలేని నిర్మాణాలు

దుండిగల్, మే 19 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతులు తీసుకోకుండానే అక్రమనిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిర్మాణదారులు జీ+2వరకు అనుమతులు తీసుకుని జీ+5, ఆపై అంతస్తుల వరకు భవనాలు నిర్మిస్తున్నారు. దాంతో సంబంధిత అధికారులపై ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గాజులరామారం, సూరారం, జగద్గిరిగుట్ట, చింతల్ డివిజన్లలో ఈ సమస్య నెలకొన్నదని అంటున్నారు. పాతబిల్డంగ్‌లపై భారీ షెడ్లు వేస్తున్నారు. సెల్లార్లు తవ్వుతున్నా అధికారులు చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పిల్లర్లు, స్లాబుల

నాణ్యతను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. అధికారులు, సిబ్బంది కనపడక పోవడంతో దాని మర్మమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కూకట్‌పల్లి జడ్సీ సమావేశాలు ఏర్పాటు చేసి టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మీటింగ్‌లో ఉన్నా.. సెక్షన్ అధికారులే చూసుకుంటారు..

ఇదే విషయమై గాజులరామారం సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా స్పందించేందుకు ఆయన నిరాకరించారు. తాను మీటింగ్‌లో ఉన్నానని,అంతా సెక్షన్ అధికారులే చూసుకుంటారని. ఏదైనా ఉంటే వారితో మాట్లాడుకోమని చెపుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సెక్షన్ అధికారులు కూడా.. అసలే స్పందించకపోడం గమనార్హం.

ఉప్పల్ శిల్పారామంలో కూచిపూడి ప్రదర్శన

ఉప్పల్, మే 19: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం కుమారి అంజలి పెనుగొండ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన చూపరులను అలరించింది. తాండవ నృత్యకారి మూషిక వాహన, రుక్మిణి ప్రవేశం, బ్రహ్మాంజలి, పలుకే పంగారమాయెనే, పుష్పాంజలి, అలివేలు మంగ, కులుకగ నడవరో, నమశ్శివాయతే, గోవర్ధన గిరిధర, జతిస్వరం, చక్కని తల్లికి చాంగ్ భళా, కృష్ణ శబ్దం, గోవిందా గోవిందా అంశాలను నిధి, సుధేష్ణ, వంశిక, సిరి, తనూజ, అనన్య, స్నికిత, కీర్తి ప్రదర్శించారు.

ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ విఫలం



ఏదులాబాద్‌లో రైతులకు కాంటాలను అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి.

ఘట్‌కేసర్,మే19: ఘట్‌కేసర్ మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆదివారం కాంటాలను అందజేశారు.గ్రామంలో ధాన్యం అమ్మడానికి రైతులు పడుతున్న ఇబ్బందులను ఎంపీపీ గుర్తించి రెండు కాంటలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అన్నారు.ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రకటిస్తున్నా,గ్రామాల్లో అమలు చేయడం లేదని పేర్కొన్నారు.దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.రైతుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్,రైతులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్, మే19 : గుండ్లపోచంపల్లి నారాయణచెరువులో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి నారాయణ చెరువులో మృతదేహం తేలుతుందని వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు నలుపు షర్ట్, పాయింట్ ధరించి ఉన్నాడని, 25 – 30 ఏండ్లు ఉండవచ్చని, పూర్తి వివరాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించామన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

వివాహిత అదృశ్యం

దుండిగల్, మే 19 : వివాహిత అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఉత్తమ్ ఠాగూర్ కుత్బుల్లాపూర్, గాజులరామారం (సర్కిల్) డివిజన్‌లోని కైసర్‌నగర్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఉత్తమ్‌ఠాగూర్‌కు తన ప్రాంతానికే చెందిన కల్పనాదేవితో వివాహమైంది. కల్పనాదేవి శనివారం రాత్రి 11: 30 గంటల ప్రాంతంలో భర్తకు చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన ఉత్తమ్‌ఠాగూర్ ఆచూకీకోసం చుట్టుపక్కల వెతికాడు. బంధువులు,స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీశాడు. ఫలితం లేకపోవడంతో ఆదివారం సాయంత్రం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఆమె ఓ వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడేదని ఉత్తమ్‌ఠాగూర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, మే 19 : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లికి చెందిన విజయ్‌కుమార్ రెడ్డి (35) ప్రైవేట్ ఉద్యోగి. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే అత్యాశతో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. కావాల్సిన డబ్బులు అప్పులు చేశాడు. ఆన్‌లైన్‌లో పెట్టిన డబ్బులు తిరిగి రాకపోవడంలో మనస్తాపానికి గురై.. శనివారం ఉదయం 10 గంటలకు తన ఇంట్లో బెడ్‌రూంకు గడియ పెట్టుకొని ఫ్యాన్‌కు నైలాన్‌తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చర్లపల్లి, మే 19: నియోజకవర్గ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని సోనియా గాంధీనగర్ ఫేజ్1 నూతన కమిటీ ప్రమాణాస్వీకారోత్సవానికి స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. సోనియాగాంధీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం కాలనీ నూతన కమిటీ సభ్యులు శ్యామల భిక్షపతి, పలుగుల గోపాల్, తాండ్ర యాదగిరి, మైలారం బాల్‌నర్సింహ, రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పావనీమణిపాల్ రెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, నాయకులు మహేశ్‌గౌడ్, మల్లేశ్, హరినాయక్, పద్మారెడ్డి, సీతారామిరెడ్డి, రాములు యాదవ్, మహేందర్, బాల్‌నర్సింహగౌడ్, సిద్దుగౌడ్, దామోదర్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చర్లపల్లి,మే19:భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు సీపీఎం నాయకులు కృషి చేయాలని మేడ్చల్ జిల్లా పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, కృష్ణాజిల్లా సీఐటీయూ కార్యదర్శి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని సీపీఎం కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కాప్రా సర్కిల్ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం సీపీఎం నాయకులు గొడుగు యాదగిరిరావు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, శ్రీమన్నారాయణ, కేకే.ప్రసాద్, దేవిరెడ్డి, శారదలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాథోడ్ సంతోష్, పీబీ.చారి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, సీహెచ్.ప్రసాద్, గణేశ్, కొండల్‌రెడ్డి, కేవీ.చారి, గౌసియా, శారద, పోతురాజు, శివన్నారాయణ, రామ్మోహన్‌రావు, రుక్కయ్య, దేవిరెడ్డి, శివరామకృష్ణ, ఆర్ఎస్ఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ సీపీఎం పార్టీ కార్యాలయంలో ..

మల్లాపూర్: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉప్పల్ సీపీఎం పార్టీ కార్యాలయంలో సీపీఎం నేతలు సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం వినోద, ఉప్పల్ సీపీఎం పార్టీ నాయకులు జె. వెంకన్న. భీష్మాచారి, ఉర్మిళ, ఉపెందర్, వెంకటేశ్, పద్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల మధ్యనే మురుగు..పరుగు

కీసర, మే 19: ఇండ్ల మధ్యనే మురికినీరు ప్రవహిసున్నది. దీనికి తోడు పందుల స్వైరవిహారం అయినా పంచాయతీ అధికారుల పట్టించుకోవడంలేదు. కీసరలోని ప్రధాన రోడ్డుకు ఆనుకొని తుర్కొల్ల వెంచర్ ఉన్నది. దానికి ముందు మెయిన్‌రోడ్డులో ఓ కట్టెల మిషన్ యజమాని 4 అంతస్తుల ఇల్లు నిర్మించుకొని ఆ ఇంట్లో నుంచి వెలువడే మురికి నీటినంతా అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లనీయకుండా వెనుక ఉన్న కాలనీల్లోకి పంపిస్తుండటంతో పెద్ద మురికి కూపంగా మారిపోయింది. ఆ మురికిలో ప్రతిరోజు పందుల స్వైరవిహారం చేస్తున్నాయి. విషయంపై స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నాన్నరన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని కాలనీల్లోకి మురికి నీరు రాకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.

దివ్యాంగులకు చక్రాల కుర్చీల అందజేత

శామీర్‌పేట, మే 19: మూడుచింతపల్లి మండలం జగన్‌గూడ, సంపన్‌బోల్ గ్రామాల దివ్యాంగులకు ప్రొఫెసర్ కొల్లూరి హరగోపాల్, భారతి దంపతులు చక్రాల కుర్చీలను అందజేశారు. దాతలు మనిగండ్ల కిష్టయ్య అండ్ సన్స్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం జగన్‌గూడలో జరిగిన కార్యక్రమంలో చక్రాల కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో కిష్టయ్య, దివ్యాంగులు శంకర్‌రావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చక్రాల కుర్చీలను అందజేసిన దాతలు

21నుంచి నృసింహ జయంతి వేడుకలు

నేరేడ్‌మెట్, మే 19: గౌతంనగర్ డివిజన్‌లోని శ్రీ జయగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో చాంద్రమాన క్రోధి నామ సంవత్సర వైశాఖ మాసం శుక్లపక్షం సందర్భంగా 21 నుంచి 22 వరకు శ్రీ నృసింహ జయంతి వేడుకలు జరగనున్నట్లు ఆలయ చైర్మన్ అరుణ్ సింగ్ తెలిపారు. 21 మంగళవారం ఉదయం 5గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకం, 9గంటలకు అంకురారోపణ, పుణ్యాహవచనం ఉంటాయి. 22న 7గంటలకు స్వామి వారి మూలమంత్ర హవనం 11గంటలకు స్వామివారి కల్యాణం, మహానివేదనం, హారతి, మంత్రపుష్పం ఉంటాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి రమాదేవి, అర్చకులు రఘు కిరణాచార్యులు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

శామీర్‌పేట, మే 19 : శామీర్‌పేట మండలం లాల్‌గడీమలక్‌పేట భవన నిర్మాణ కార్మికుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు నీలం భిక్షపతి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండలం అధ్యక్షుడు బండి నాగభూషణం ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని నియమించారు. అధ్యక్షుడిగా బండి రాములు, ఉపాధ్యక్షుడిగా గంట రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్, సహ కార్యదర్శిగా రామకృష్ణ, కోశాధికారిగా నారాయణ, ఆర్గనైజర్లుగా రామకృష్ణ, మాధవ, నర్సింహ, మల్లేశ్, యాదగిరిని ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని సంఘం నాయకులను సన్మానించి, కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు.

అభివృద్ధిలో .. భాగస్వాములు కావాలి

మల్కాజిగిరి, మే 19: కాలనీ అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని మౌలాలి డివిజన్ గాయంత్రి నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంటేకార్ మహేశ్‌అన్నారు. ఆదివారం జరిగిన కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలో అధ్యక్షుడుగా కంటేకార్ మహేష్, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, కోశాధికారిగా మైఖేల్ ఎన్నికైనారు .ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ సభ్యు లు రాజు, సింగారస్వామి, సురేందర్ రెడ్డి, స్వామి, దేవేందర్, కాలనీ నాయకులు మాజీ అధ్యక్షుడు లోహిత్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, దయాకర్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్‌గౌడ్, రమేష్, గంగాధర్, ఆదిత్య, విక్రమ్, ధీరజ్ పాల్గొన్నారు.